క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: నగర పరిధిలోని నూతక్కి, చిర్రావూరు, పెదవడ్లపూడి, కొత్తపాలెంలలో శనివారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఆటంకం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేఎల్ యూనివర్సిటీ రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు, బాపూజీనగర్, శిబిరం ఏరియాలలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లేన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంత పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లేన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్, అరవింద స్కూల్ రోడ్ ప్రాంతం, శుభమస్తు ఫంక్షన్ హాల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులకు సహకరించాలని కోరారు.

తాడికొండ: తాడికొండ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ రవికుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని సూచించారు.

విద్యుత్ పొదుపుతోనే అధిక లాభాలు



ఫిరంగిపురం: విద్యుత్‌ను పొదుపు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని విద్యుత్ శాఖ ఈఈ చల్లా రమేష్ అన్నారు. మండలకేంద్రంలోని నవభారత్ రెసిడెన్సీలో శుక్రవారం సాయంత్రంవిద్యుత్ పొదుపు చేయడంపై వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ జీవనశైలి ద్వారా విద్యుత్‌పొదుపు, నీటిపొదుపు, ప్లాస్టిక్ వినియోగం రద్దు వంటి వాటి ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరు తమ ఇంటిలో విద్యుత్‌ను దుర్వినియోగం చేయకుండా చూసుకోవాలన్నారు. ఎంతవరకు విద్యుత్ అవసరమోగుర్తించి మిగిలిన సమయాల్లో పొదుపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ గురునాథరావు, ఏఈ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు



తాడికొండ: విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం తుళ్లూరు మండలంలోని రాయపూడి సెక్షన్ పరిధిలో ఉన్న 12 గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు విద్యుత్ విజిలెన్స్ ఈఈ కేవీఎల్ఎన్ మూర్తి, సీఆర్డీయే సర్కిల్ ఎస్ పి విజయకుమార్ తెలిపారు. ఈ తనిఖీలలో అధిక లోడ్ వాడుతున్నట్లు గుర్తించిన 95 మందిపై కేసు నమోదు చేయగా, గృహం నుంచి దుకాణానికి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వినియోగదారుడికి రూ.30 వేలు జరిమానా విధించినట్లు వారు తెలిపారు. దాడులలో అమరావతి ఈఈ టీవీ తులసీరామ్, డిప్యూటీ డీఈ కేవీ కోటేశ్వరరావు,అక్కల సత్యనారాయణ, ఏఈ చిలకరాజు సబ్ డివిజన్ పరిధిలోని ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

ఓబీసీ వాటా ప్రకటించాలి

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబీల వాటా శాతం స్పష్టం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన 33శాతం మహిళ బిల్లులో జనాభాలో అత్యధికంగా ఉన్న ఓబీసీ మహిళలకు ఎంత రిజర్వేషన్ కల్పిస్తారో చెప్పక పోవడం బాధాకరమని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ఓబీసీ మహిళల వాటా శాతం ఎంతో ప్రకటించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 12న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఒకరోజు నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు పరేపల్లి మహేష్, తురక శ్రీనివాస్, తురక రమేష్, కొల్లూరి హనుమంతురావు, ద్వారక శ్రీను పాల్గొన్నారు.

దంత పరీక్షలు

కొరిటెపాడు(గుంటూరు): తమిళనాడ్ మార్కంటైల్ బ్యాంక్(టీఎంబీ) లిమిటెడ్ 102 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా కాన్ఫిడెన్స్ డెంటల్ హాస్పిటల్ సహకారంతో పట్నంబజారులోని బ్యాంక్ ఆవరణలో శుక్రవారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుమారు 150 మంది దంత పరీక్షలు చేయించుకున్నారు.

మళ్లీ జగనే కావాలి

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
- పలుచోట్ల 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



డిజిటల్ బోర్డు ఆవిష్కరిస్తున్న దుగ్గిరాల ఎంపీపీ డి.సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు అరుణ



పథకాలు తెలియజేసే బోర్డు ఆవిష్కరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్



జెండా ఆవిష్కరిస్తున్న కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డి

మంగళగిరి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకుని ప్రజలు సంతోషంగా ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగర పరిధిలోని నవులూరు 3వ వార్డు సచివాలయంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్(ఏపీకి జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రారంభించారు. సచివాలయ పరిధిలోని ప్రజలకు అందిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి వారికి వివరించారు. లబ్ధిదారులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తాము పొందిన సంక్షేమ పథకాలను వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు అందించిన లబ్ధిని వివరించి మీకు లబ్ధి చేకూరి ఉంటేనే నాకు ఓటు వేయండి అని ధైర్యంగా ప్రకటించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికి లబ్ధి జరిగిందని ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల వివరాలు, వారికి అందిన పథకాలు తెలియజేస్తాయన్నారు. తాము పొందిన లబ్ధిని వివరించిన లబ్ధిదారులు మరలా జగనే కావాలని చెప్పడం అభినందనీయమన్నారు. తమకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల మాత్రమే సాధ్యమవుతుందని నమ్మిన ప్రజలు మరలా ఆయన నాయకత్వాన్ని కోరుకుంటున్నారనడంలో సందేహం లేదని స్పష్టం చేశారు. నాడు–నేడు ద్వారా పాఠశాలలు, వైద్యశాలలను ఆధునికీకరించారని తెలిపారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే కాకుండా ఇంటి వద్దకు చేరువ చేసేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ నిర్మల్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ అన్నపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ఈపూరి ఆదామ్, స్థానిక నాయకులు షేక్ షఫీ, పులి రామారావు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్నే కావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనన్న ఎందుకు కావాలి) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత తుమ్మపూడి సచివాలయం వద్ద నాలుగు సంవత్సరాలుగా జగనన్న ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి కాకముందు రాష్ట్రం మొత్తం పాదయాత్ర చేసి ప్రజలు పడుతున్న కష్టాలను తెలుసుకుని రెండు పేజీల మేనిఫెస్టో ప్రకటించారని, అధికారంలోకి రాగానే 99 శాతం అమలు చేశారు. కోట్లాది మందికి సంక్షేమాన్ని అందిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నడూ లేని విధంగా ఎన్నో కంపెనీలు వచ్చి పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పిస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో, వైద్యశాలల్లో పెనుమార్పులు తీసుకువచ్చి పేదప్రజలకు ఒక నమ్మకాన్ని కలిగించారని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినపుడు ఆ కుటుంబాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా పయనిస్తూ మహిళలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఇవన్నీ అమలు కావాలంటే మరల ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, ఎంపీడీఓ దేవరపల్లి వీరయ్య, సర్పంచ్ షేక్ అజీజున్, ఉప సర్పంచ్ బుద్దుల రమేష్, ఈవోపీఆర్డీ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి టి.భవాని, మండల జేసీఎస్ ఇన్‌చార్జి యేమినేని రవి, నాయకులు దాసరి వీరయ్య, షేక్ జానీబాషా, షేక్ సుభాని, కంఠంరాజు కొండూరు సర్పంచ్ ఉన్నం ఝాన్సీ, తాడేపల్లి జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, ఉన్నం రాజేష్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పెద్దపీట వేసిన ఘనత జగన్‌దే

ఫిరంగిపురం: రాష్ట్రంలో పేదలందరికి సంక్షేమ పథకాలు అందజేసి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. ఫిరంగిపురంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సొలస బస్టాండ్ సెంటర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో మండలానికి వచ్చిన వివిధ పథకాలు తెలియజేసే బోర్డు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు తన పద్నాలుగేళ్ల పాలనలో ప్రజలకు ఎటువంటి సంక్షేమం అందించలేదని చెప్పారు. ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల,మత, ప్రాంత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, ఎంపీపీ షేక్ షహేలానర్గీస్, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, కె.చిన్నప్పరెడ్డి, పి.జేమ్స్‌ఇన్నయ్య, మేడా బాబు, వై.రమాదేవి, డి.మెల్కియా, వీరయ్య, పి.మరియబాబు, రంజన్‌బాబు, సుధాకరరెడ్డి, పి.చిన్న, డేవిడ్, బి.అంజిరెడ్డి, ఇజ్రాయిల్, హేమలత, లక్ష్మయ్య, వై.యల్లారెడ్డి, ఎస్.నాగరాజు, ఎంపీడీవో విలియమ్స్, ఈవోపీఆర్డీ నిర్మలలక్ష్మీకుమారి, కార్యదర్శి విష్ణువర్ధన్ రావు, ఎస్ఐ చల్లా కిషోర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మేడికొండూరు: దేశంలో ఎవరికి రాని ఆలోచన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చిందని, అందువల్లే ప్రజలందరికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజక వర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, నియోజక వర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. మేడికొండూరు గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 90 శాతం మంది ప్రజలకు సంక్షేమం అందిందన్నారు. సీఎం వై.ఎస్.జగన్ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రతి సచివాలయానికి కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి అందించే ముఖ్యమంత్రి కావాలా? 14 సంవత్సరాల పాలన చేసి రాష్ట్రాన్ని దోచుకున్నవారు కావాలా? ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. నాటి పాలనకు, నేటి పాలనకు తేడా ప్రజలు గమనించాలన్నారు. విద్య, వ్యవసాయం, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయం–2కు అందించిన సంక్షేమం గురించి వివరించారు. ఏఏ పథకాలకు ఎంత కేటాయించారన్న విషయాన్ని ప్రదర్శనగా ఉంచారు. దానిని కత్తెర సురేష్‌కుమార్, బత్తుల బ్రహ్మానందరెడ్డిలు ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కందుల సిద్ధయ్య, మండల కన్వీనర్ తాళ్లూరు వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, సొసైటీ చైర్మన్‌లు, పాముల పాటి జయరావు, షేక్ గాలిబ్, ఎంపీటీసీలు సాంబ్రాజ్యం, ముత్యాల బాలస్వామి, అర్జునరావు, శివరామిరెడ్డి, చంటిబాజీ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం



కల్యాణ మండపాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నిర్మల్‌కుమార్, తహసీల్దార్ నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకుని తమ సమస్యలను వివిధ శాఖల అధికారులను విన్నవించుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మలకుమార్, తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బైపాస్‌రోడ్డు వెంబడి ఉన్న శుభమస్తు కల్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన తాడేపల్లి పట్టణ రూరల్‌పరిధికి సంబంధించి ప్రజలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఆర్‌వో మురళి, ఆర్ఐ వంశీ పాల్గొన్నారు.

బాలల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే బాలోత్సవం



బాలోత్సవ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మంగళగిరి: బాలలలో సృజనాత్మకతను వెలికితీసేందుకే బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విజ్ఞాన కేంద్రాల కన్వీనర్ పి మురళీకృష్ణ తెలిపారు. నగర పరిధిలోని యర్రబాలెం డాన్‌బాస్కో స్కూలులో డిసెంబర్ 19, 20 తేదీలలో జరగనున్న బాలోత్సవ్ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ బాలోత్సవ్ కార్యక్రమాలలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి సుమారు 4వేల మంది విద్యార్థులు పాల్గొనున్నట్లు తెలిపారు. నేడు పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య లేకపోవడంతో విద్యార్థులు సృజనాత్మకత కోల్పోతున్నారన్నారు. బాలోత్సవ కార్యక్రమాన్ని విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో విజ్ఞాన వేదిక ప్రతినిధులు వి.వి.ప్రసాద్, డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, ఎం విజయమోహనరావు, వై బాలకృష్ణ, అందె రేవంత్, గోపాలం సాంబశివరావు, వి వెంకటేశ్వరరావు, సాదు చంద్రశేఖర్, ఎస్ బాలకృష్ణ, సింహాద్రి సుమ, ఇసునూరి అనిల్ చక్రవర్తి, గాజుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ విస్తృత పర్యటన



బకింగ్‌హామ్ కెనాల్‌పై బ్రిడ్జిని పరిశీలిస్తున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణం, రూరల్ పరిధిలో నగర పాలక సంస్థ కమిషనర్ నిర్మల్‌కుమార్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. తాడేపల్లి పాత టోల్‌గేట్ దగ్గర నుంచి పశువుల హాస్పిటల్ వద్ద బకింగ్‌హామ్ కెనాల్ మీదుగా వైఎస్సార్ సెంటర్, రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిని ఆయన పరిశీలించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్యారీ కంపెనీలోని హెలిప్యాడ్, ఎన్టీఆర్ కరకట్టపైన, కొత్తూరు ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద గల తాగునీటి పంప్ హౌస్‌లను పరిశీలించారు. అనంతరం తాడేపల్లి ప్రధాన రహదారి అయిన ఉండవల్లి సెంటర్ నుంచి సాయిబాబా గుడి వరకు పరిశీలించి రోడ్డు ఆక్రమణలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌కు భారత ప్రభుత్వం మద్దతు పలకడం దారుణం

తాడేపల్లిరూరల్: పాలస్తీనా ప్రజలను ఊచకోత కోస్తున్న ఇజ్రాయెల్‌కు భారత ప్రభుత్వం మద్దతు పలకడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. దుగ్గిరాలలో వామపక్ష పార్టీలు పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలియచేస్తూ శుక్రవారం ప్రదర్శన నిర్వహించాయి. ఆయన మాట్లాడుతూ ఇజ్రాయెల్ పాలస్తీనాలోని హాస్పిటల్స్‌పై బాంబుల వర్షం కురిపిస్తున్నారని, దీంతో వేలాది మంది చిన్నపిల్లలు, మహిళలు చనిపోయారని, అక్కడి ప్రజలు తిండిలేక, నీరు లేక అవస్థలు పడుతున్నారని, వెంటనే యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలని పాలస్తీనా ప్రజలను ఆదుకోవాలని కోరారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు లోకం భాస్కరరావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం విదేశాంగ విధానాన్ని నరేంద్రమోడీ ప్రభుత్వం విడనాడి ఇజ్రాయెల్‌కు మద్దతు పలుకుతున్నారని అన్నారు. పాలస్తీనా ప్రజలను ఆదుకోవడానికి అన్ని దేశాలు ముందుకు రావాలని కోరారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు షేక్ సుభాని మాట్లాడుతూ పాలస్తీనాలో జరుగుతున్నది రెండు మతాల మధ్య గొడవ కాదని, జాతుల మధ్య గొడవని కాదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు, సీపీఐ నాయకులు వై. శివయ్య, దుగ్గిరాల గ్రామ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.నాగుర్ బాష, సీపీఎం మండల నాయకులు వై.బ్రహ్మేశ్వరరావు, ఎన్. యోగేశ్వరరావు, బి.అమ్మిరెడ్డి, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మండల పరిధిలోని విశదల గ్రామానికి చెందిన పి.ఇమ్మానియేలు (28) ద్విచక్రవాహన మెకానిక్‌గా పేరేచర్లలో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం అర్ధరాత్రి పేరేచర్ల నుంచి విశదల గ్రామానికి వెళుతున్న సమయంలో మార్గమధ్యంలో బ్రిక్స్ కంపెనీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో ఇమ్మానియేల్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.ఘటనపై మేడికొండూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయంలో మేలైన విత్తనంతోనే అత్యధిక దిగుబడి

ఏడీఏ జి శ్రీనివాస్‌రెడ్డి

మంగళగిరి: మేలైన విత్తనం ఎంపిక చేసుకున్నప్పుడే రైతు మంచి దిగుబడి సాధించగలడని వ్యవసాయ శాఖ ఏడీఏ జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరులో శుక్రవారం వ్యవసాయ రంగంలో తొలి ప్రాధాన్యత విత్తనం గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎన్నుకున్న రైతుల ద్వారా వారి కమతాలలో విత్తనం సాగుచేసి ఆ విత్తనం రైతులకు సరఫరా చేయడంతో విత్తన కొరతను అధికమించవచ్చడంతో నాణ్యమైన విత్తనం పొందవచ్చన్నారు. 30 మంది రైతులకు 25 కేజీల చొప్పున 50 కేజీల రాయితీతో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేయడం జరిగిందన్నారు. మండల వ్యవసాయాధికారి జెడ్ శైలజారాణి, మండల ఉద్యాన అధికారి దీపిక తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి సభను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: అసమానతలు లేని అభివృద్ధి కోసం నవంబర్ 15న విజయవాడలో సీపీఎం ఆధ్వర్యాన జరిగే ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అన్నారు. తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో బహిరంగసభ పోస్టర్‌ను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మివేస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, సామాన్యులు కొనే పరిస్థితుల్లో లేరని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టె కరుణాకరరావు, దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కోట బాబూరావు, కట్టా మేరి, కంపా వెంకటయ్య, బుర్రముక్కు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని వ్యతిరేకించండి

ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న బీజేపీని వ్యతిరేకించాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నగర పరిధిలోని కుంచనపల్లిలో శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసేందుకు నల్ల చట్టాలు తీసుకొచ్చిందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీలు నెరవేరుస్తామని, ప్రత్యేక హోదా కల్పిస్తామని చెప్పి మోసం చేసిందని విమర్శించారు. ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం కుంచనపల్లి గ్రామ కార్యదర్శులు అమ్మిశెట్టి రంగారావు, కాజా వెంకటేశ్వర్లు, నాయకులు అమ్మిశెట్టి రామారావు, కాజా వెంకటేశ్వరరావు, నల్లపు బాబూరావు, అమ్మిశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు లాటరీ



దుకాణదారుల సంతకాలు సేకరిస్తున్న తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలకు శుక్రవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి ఆధ్వర్యంలో లాటరీ తీశారు. తహసీల్దార్ నాగిరెడ్డి మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్‌పరిధిలో మొత్తం 21 షాపులు ఏర్పాటు చేస్తున్నారని, తాడేపల్లి పట్టణ పరిధిలో వ్యాపారం చేసుకునేవారికి కనకదుర్గ వారధి, రేపల్లె కరకట్ట వెంబడి ఉన్న గుడ్‌న్యూస్ పాఠశాలలోను, తాడేపల్లి రూరల్ పరిధిలో ఉండవల్లి అమరావతి రోడ్‌లో గల దేవాలయ భూముల్లో షాపులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇచ్చామని, 11 నుంచి 13వ తేదీ వరకు బాణసంచా అమ్ముకునేందుకు అనుమతిచ్చామని, వ్యాపారం చేసుకునే 21 మందికి లాటరీ పద్ధతిలో షాపులు కేటాయించామని తెలిపారు. షాపులు ఏర్పాటు చేసుకునే సమయంలో తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని, అలా పాటించని వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ప్రధాన రోడ్ల మరమ్మతులు నెలాఖరులోగా పూర్తి

ఇంజినీరింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశం



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలోని ప్రధాన రోడ్లకు మరమ్మతులను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గోతులు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇందులో కొన్ని నగర పాలక సంస్థవి అయితే మరికొన్ని ఆర్ అండ్ బీకి చెందినవి ఉన్నాయని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నెలాఖరు నాటికీ పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. రోడ్ల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, డీఈఈలు మరింత బాధ్యత తీసుకోవాలని ఆమె ఆదేశించారు. వార్డు సచివాలయం పరిధిలో రెసిడెన్షియల్, కమర్షియల్ వాటర్ ట్యాప్ కనెక్షన్లపై అడ్మిన్, ఎమినిటీ కార్యదర్శులు సంయుక్త పరిశీలన చేసి, వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు. దాని ఆధారంగా క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తామని వెల్లడించారు. ప్రతి ఇంజినీరింగ్ అధికారి వాటర్ బైలాపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. నగరంలో పూర్తయిన అభివృద్ధి పనులకు బిల్లుల్ని వేగంగా ఆన్‌లైన్ చేయాలని, పెండింగ్ ఉంచవద్దని తెలిపారు. నగరంలోని బస్టాండ్‌ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, యూజీడీ కార్మికులకు రక్షణ పరికరాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అనంతరం జగనన్న కాలనీల్లో ఇళ్ల పురోగతిపై కమిషనర్ సమీక్షించారు. నోడల్ అధికారులు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలని చెప్పారు. ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు మేరకు బహుళ అంతస్తు నిర్మాణాలు చేపట్టాలి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాల ర్యాంప్‌లు రోడ్డు మీదకు రాకూడదని, సెట్ బ్యాక్‌లో నిర్మాణాలు చేయకూడదని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ జారీ చేయబోమని తెలిపారు. నగరంలోని ఎస్వీఎన్ కాలనీ, నవభారత్ నగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాల్ని ఆమె పరిశీలించారు. తదుపరి అనుమతులపై పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతోంది.. లేనిదీ ? పరిశీలించాలని ఆదేశించారు. డెప్యూటీ సిటీప్లానర్ మహాపాత్రో, అసిస్టెంట్ సిటీప్లానర్ మురళి, టీపీఎస్ హృదయరాజు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ

నెహ్రూనగర్: మార్టిన్ లూథర్ జయంతిని పురస్కరించుకుని ఏఈఎల్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మోడరేట్ బిషప్ పరదేశిబాబు మాట్లాడుతూ మార్టిన్ లూథర్ జయంతిని పాస్టర్స్ డేగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల మధ్య శాంతి, సమాధానం కోసం నగరంలో శాంతి ర్యాలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. బిషప్ బాబూరావు, దైవాశ్వీరాదం, ప్రకాష్ పాల్గొన్నారు.